## 20 నుంచి ఓటరు జాబితా సవరణ

- జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంతోష్

గద్వాల, ఆగస్టు 17 : ఈనెల 20వ తేదీ నుంచి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, అదనపు చీఫ్ ఎలక్టోరల్ అధికారి లోకేశ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈనెల 20నుంచి అక్టోబర్ 18వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఉంటుందన్నారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా, మార్పులు, తప్పుల సవరణ చేపట్టాలని ఆదేశించారు. అక్టోబర్ 29న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించడం జరుగుతుందన్నారు. సవరణలు, అభ్యంతరాలకు నవంబర్ 28వరకు గడువు ఉంటుందని, డిసెంబర్24లోగా పరిష్కరించి జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సూచనలు, అభిప్రాయాలను తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రావు, ఆర్డీవో రాంచందర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నరేశ్ పాల్గొన్నారు.

## 'రుణమాఫీపై సీఎంకే స్పష్టత లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు జాన్‌వెస్లీ

అమరచింత, ఆగస్టు 17 : రైతులకు రూ.రెండు లక్షలు రుణమాఫీ చేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నదని, కేవలం కొందరికే మాఫీ చేసి గొప్పలు చెప్పుకోవడం విచారకరమని సీపీఎం రాష్ట్ర నేత జాన్ వెస్లీ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదట రుణమాఫీకి రూ.43వేల కోట్ల నిధులు అవసరమవుతాయని చెప్పారని, తర్వాత రూ.31వేల కోట్లు కేటాయిస్తామని, మరోమారు లెక్కలు వేసి రూ.26వేల కోట్లు సరిపోతాయని కాకిలెక్కలు చెప్పారన్నారు. తీరా బడ్జెట్‌లో కేవలం రూ.18వేల కోట్లు మాత్రమే మాఫీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కు రుణమాఫీపై అవగాహన లేదనేది తేటతెల్లమవుతున్నదన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలు, తదితర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కలకత్తాలో వైద్యురాలి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోపి, నాయకులు వెంకటేశ్, రమేశ్, అజయ్, బుచ్చన్న ఉన్నారు.

## అలుగు ధ్వంసంతో నీటి వృథా



అలుగుకు మరమ్మతులు చేస్తున్న అధికారులు

పెబ్బేరు, ఆగస్టు 17 : మండలంలోని సూగూరుకు చెందిన నల్లచెరువు కుడి, ఎడమ అలుగులను రెండు రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో చెరువులోని నీరంతా వృథాగా పారుతుండగా, శనివారం అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి అడ్డుకట్ట వేశారు. ప్రతి యేటా కొందరు వ్యక్తులు అలుగు విధ్వంసానికి పాల్పడుతున్నట్లు కొత్త సూగూరు మాజీ సర్పంచ్ జూదం వెంకటేశ్ తెలిపారు. ఈ విషయాన్ని నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకురాగా, ఏఈ కిశోర్ జేసీబీ సాయంతో అలుగు నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకున్నారు.

## పొలంబాట పట్టిన విద్యార్థులు



నిర్విన్ శివారులో వరినాట్లు వేస్తున్న విద్యార్థినులు

కొత్తకోట, ఆగస్టు 17 : పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థినులు శనివారం పొలం బాట పట్టారు. మండలంలోని నిర్విన్ శివారులో గల వ్యవసాయ క్షేత్రాలను విద్యార్థులు శనివారం సందర్శించి కూలీలతో కలిసి నాట్లు వేశారు. వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడం ద్వారా వ్యవసాయ పనులపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని పాఠశాల డైరెక్టర్ మల్లేశ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**
★జడ్చర్ల టౌన్‌లో @ DTCP, RERA అప్రూవ్డ్ వెంచర్‌లో వెంటనే ఇళ్ళు కట్టుకోవడానికి అనువైన ప్లాట్స్, సీసీ రోడ్స్, బ్యాంక్ లోన్‌తో కలవు. 6309977999
NT- 40

**KIDNY STONES**
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580
NT- 332617

**WANTED**
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325790-All

**ప్రకటన**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# ఓటరు నమోదులో తప్పులుండొద్దు

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, అధికారులు

వనపర్తి టౌన్, ఆగస్టు 17 : ఓటరు నమోదులో పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎలక్ట్రోల్ అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లతో ఎస్ఎస్ఆర్‌పై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ తాసీల్దార్లు, ఆర్డీవోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటరు నమోదుపై బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి విచారణ చేయాలన్నారు. చనిపోయిన, ప్రాంతం మారిన ఓటర్లను జాబితా నుంచి తొలగించి కొత్త ఓటర్లను జాబితాలో చేర్పించేలా చూడాలన్నారు. ఇంటింటి సర్వే వివరాలు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. 1 జనవరి 2007కు ముందు పుట్టిన యువత ఓటరు జాబితాలో పేరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫారం 6,7,8లో ఉన్న అంశాల గురించి వివరించారు. ప్రతి బీఎల్‌వో రోజుకు ఇరవై ఇండ్లు సందర్శించి విచారణ చేయాలని సూచించారు. 20ఏండ్ల కాలంలో ఎన్నికల్లో పోటీ చేసిన ఉద్యోగులు, న్యాయవాదులు, జర్నలిస్ట్‌ల పేర్లు మార్క్ చేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.నగేశ్, ఆర్డీవో పద్మావతి, తాసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

***పోడు పట్టాల సమస్యలు పరిష్కరిస్తాం..***

జిల్లాలో పోడు పట్టా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శనివారం రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖల మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అనసూయ(సీతక్క) కలెక్టర్లు, అటవీశాఖ అధికారులు, శాసన సభ్యులతో పోడుభూముల సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇచ్చిన పట్టా భూములకు హద్దులు చూపించాలని కలెక్టర్లకు సూచించారు. సమీక్షలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్‌రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి అధికారి నుషితతోపాటు తదితరులు పాల్గొన్నారు.

### విజయరాయుడికి ప్రత్యేక పూజలు



దాసాంగాలు పెడుతున్న భక్తులు

అయిజ రూరల్, ఆగస్టు 17 : మండలంలోని సంకాపురం శివారులో వ్యాసరాయులచే ప్రతిష్ఠించబడిన విజయరాయుడికి (గాయిత్రీ ఆంజనేయస్వామి) శనివారం గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు శ్రావణమాస పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి అర్చకులు అప్పన్నచార్యులు నదీజలాలతో అభిషేకం నిర్వహించి అర్చన, హోమం, ఆకుపూజ చేశారు. అలాగే గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఎద్దుల బండిపై బాజాభజంత్రీలతో మహిళలు మంగళహారతులు చేపట్టి శోభాయాత్ర నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కొత్త కుండలో బియ్యం, బెల్లంతో పాయసం తయారుచేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ప్రతి యేటా శ్రావణమాసం రెండో శనివారం విజయరాయుడికి పూజలు నిర్వహించడం గ్రామస్తుల ఆనవాయితీ.

### ప్రత్యేక అలంకరణలో తిమ్మప్పస్వామి

అయిజ, ఆగస్టు 17 : పట్టణ సమీపంలోని స్వయంభూ కట్టకింద తిమ్మప్పస్వామి శ్రావణమాసం రెండో శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తనూర్ ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

### అనాథలకు ఉచిత విద్య

వడ్డేపల్లి, ఆగస్టు 17 : తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ప్రతి సంవత్సరం నలుగురికి ఉచిత విద్యను అందిస్తున్న శివశివాణి పాఠశాల యాజమాన్యాన్ని ఎంఈవో నరసింహా శనివారం అభినందించారు. లక్కీడిప్ ద్వారా ప్రణవి, ప్రణీత, ఆద్యప్రియ, రూన్సీరాణిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ట్రస్మా ప్రెసిడెంట్ బీచుపల్లి, బాబునాయుడు, మోయిన్‌బాషా, కృష్ణ, విజయసారథి రెడ్డి, పాఠశాల యాజమాన్యం ఈశ్వరి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

### మురుగుతో దోమలు వ్యాప్తి

పాన్‌గల్, ఆగస్టు 17 : నివాస ప్రదేశాల్లో మురుగు నిల్వ ఉండడం వల్ల దోమల సంతతి పెరిగి మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని మండల వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని శాగాపూర్ గ్రామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామయ్య, హెల్త్ అసిస్టెంట్ రాంచందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

## పాఠశాలల్లో రాఖీ వేడుకలు



గీతాంజలి పాఠశాలలో రాఖీ కడుతున్న విద్యార్థినులు

అయిజ, ఆగస్టు 17 : పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తు రాఖీ పౌర్ణమి నిర్వహించారు. విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాఖీ పండుగ ప్రాముఖ్యతను గురించి వివరించారు. ప్రతిఒక్కరూ తోడునీడగా, సేవాభావంతో మెలగాలని విద్యార్థులకు సూచించారు.

***శాంతినగర్ సరస్వతీ పాఠశాలలో..***

వడ్డేపల్లి, ఆగస్టు17 : మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లోని సరస్వతీ పాఠశాలలో కరస్పాండెంట్ మమత, రవి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. ఒకరికొకరు రాఖీలను కట్టుకున్నారు. 600 మంది విద్యార్థులు రాఖీ ఆకారంలో కూర్చొని అబ్బుర పరిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం గోవిందు, వెంకటేశ్, నవీన్, మాధవి, ఫిర్దోస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు భోజన సౌకర్యం కల్పించాలి



రాజీవ్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న దృశ్యం

వనపర్తి టౌన్, ఆగస్టు 17 : పేదలకు రూ.5కే భోజన పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ దళిత రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు గంధం సుమన్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5కే ఉచిత భోజనం అమలు చేయాలని, ఇందుకు ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ దళిత రిజర్వేషన్ సమితి నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటి సంరక్షించాలి

మల్దకల్, ఆగస్టు 17 : మండలంలోని పెద్దొడ్డిలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయరెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో చెన్నయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### రైతులు అధికారుల సూచనలు పాటించాలి

చిన్నంబావి, ఆగస్టు 17 : పంటసాగులో సస్యరక్షణ చర్యల గురించి వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని అయ్యవారిపల్లిలో మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. పంట ప్రస్తుతం 45రోజుల నుంచి 55 రోజుల మధ్య ఉన్నదని, కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవో రజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### అసంపూర్తిగా రుణమాఫీ

పాన్‌గల్, ఆగస్టు 17 : ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ అసంపూర్తిగా జరిగిందని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రమేశ్ అన్నారు. శనివారం మండలంలోని వెంగలాయిపల్లిలో సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 15సింగిల్ విండోలు ఉన్నాయని, 7 సింగిల్‌విండోలలో చాలామంది రైతుల పేర్లు సంబంధిత సీఈవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్ల రుణమాఫీ కాలేదన్నారు. రైతులు వివరాలు సేకరించి మాఫీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### పాఠశాలకు సామగ్రి వితరణ

వనపర్తి టౌన్, ఆగస్టు 17 : మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హామీ మేరకు స్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టేబుళ్లు, బీరువాలు, ఆఫీస్ టేబుల్స్‌ను వితరణ చేసినట్లు హెచ్ఎం చెన్నప్ప తెలిపారు. ఎమ్మెల్యే ఇదే పాఠశాలలో చదువుకోవడంతో రూ.5లక్షల విలువైన సామగ్రి వితరణ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# హత్యాచార నిందితులను ఉరి తీయాలి

- జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో పెల్లుబికిన నిరసనలు
- వైద్య విద్యార్థుల మానవహారం
- అత్యవసర సేవలు మినహా దవాఖానల బంద్



వనపర్తిలో మానవహారంతో నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు




గద్వాల జిల్లా దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు



పెబ్బేరులో నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్ఎంపీలు

వనపర్తి టౌన్, ఆగస్టు 17 : జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో వైద్యులు, విద్యార్థులు నిరసన హోరెత్తించి కదం తొక్కారు. దుండగులను కఠినంగా శిక్షించాలని పెద్దఎత్తున వైద్యులు , నర్సులు, మెడికల్ కళాశాల విద్యార్థులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా వైద్య కార్యాలయం నుంచి ర్యాలీగా రాజీవ్ చౌరస్తాకు చేరుకొని మానవహారం నిర్మించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భాస్కర్‌ప్రభాత్, గౌరవాధ్యక్షుడు మురళీధర్, రమేశ్‌బాబు, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, జిల్లా సహాయ సూపరింటెండెంట్ సక్రూనాయక్ తదితరులు ఉన్నారు.

***నిందితులను వెంటనే శిక్షించాలి..***

గద్వాల టౌన్, ఆగస్టు 17 : వైద్య విద్యార్థిపై హత్యాచారం చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా దవాఖాన వైద్యులు, సిబ్బంది ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వినోద్, శ్యామ్, అభినేష్, వంశీ, నర్సింహులు, జస్విత, ప్రదీప్, గౌతమ్, శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

***ఆర్ఎంపీల నిరసన***

పెబ్బేరు, ఆగస్టు 17 : కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ శనివారం పెబ్బేరులో గ్రామీణ వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక సుభాష్ చౌరస్తాలో విద్యార్థిని చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వైద్యులకు రక్షణ కల్పించి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేఎం బాషా, నారాయణ, వీరయ్య, సలీం, రవి తదితరులు పాల్గొన్నారు.

***విధులు బహిష్కరించిన వైద్యులు***

అలంపూర్, ఆగస్టు 17 : పట్టణంలోని సీహెచ్‌సీలో శనివారం ఒక రోజు వైద్య సేవలను నిలిపివేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సయ్యద్‌బాషా, రాకేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

***పాఠశాల విద్యార్థుల నివాళి***

అయిజ, ఆగస్టు 17 : వైద్య విద్యార్థిని మృతికి శనివారం పట్టణంలోని బీజీఆర్ ఉన్నత పాఠశాలలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఎంతో మంది ప్రాణాలను కాపాడే వైద్యులపై ఘటనలు చోటు చేసుకోవడం దేశానికే సిగ్గుచేటని కరస్పాండెంట్ బాల వెంకట్‌రెడ్డి అన్నారు.

***పాన్‌గల్ మండలంలో..***

పాన్‌గల్, ఆగస్టు 17 : కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై లైంగికదాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు శైలజ, శివకుమార్ డిమాండ్ చేశారు. హత్యను నిరసిస్తూ శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు.

### ధీర వనిత మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ



మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ

గద్వాల టౌన్, ఆగస్టు 17 : తెలంగాణలోనే గద్వాల అతి పెద్ద సంస్థానం. నిజాం రాజుకు సైతం ముచ్చెటమటలు పట్టించిన ఘనత ఈ సంస్థానానికి ఉన్నది. సాహితీ వైభవానికి, కళలకు, సంస్కృతికి, ధైర్యానికి, పౌరుషానికి, సాంప్రదాయాలకు నెలవుగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నది. సంస్థానాన్ని స్వతంత్ర సంస్థానంగా ప్రకటించిన మొదటిరాణిగా ఆదిలక్ష్మీదేవమ్మ చరిత్రకెక్కింది. సాహిత్యాభివృద్ధికి ఎనలేని సేవచేసి విద్వద్గద్వాలగా తీర్చిదిద్దిన సాహితీవేత్త. ఈమె కాలంలో చేసిన సాహిత్య సేవను గద్వాల చరిత్రలో సువర్ణక్షరాలతో లిఖించదగినదిగా ఇప్పటికీ చెప్పుకుంటారు. ఇంతటి పేరు ప్రఖ్యాతులున్న ఈ సంస్థానానికి సుస్థిర పాలన అందించిన ధీర వనిత మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ. 1663లో మహారాజా పెద్దసోమభూపాలుడి పాలనతో ప్రారంభమైన గద్వాల సంస్థానం 1949లో శ్రీ మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ పాలనతో అంతమైంది. 1949లో జాగీరుల రద్దుతో రాజుల పాలనకు తెరపడింది. మూడేండ్లు ప్రభుత్వ పాలనను చూసిన ఆమె 18-8-1953న మరణించారు. 25సంవత్సరాలు సాగిన రాణి పాలనను ఇప్పటికీ ఎవరూ మరచిపోలేదు. ఆదివారం ఆమె వర్ధంతిని నిర్వహించి స్మరించుకోనున్నారు.

### కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల టౌన్/వనపర్తి టౌన్, ఆగస్టు 17 : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా స్పెషల్ ఆఫీసర్ రతన్‌కుమార్, జిల్లా సహాయ సంచాలకుడు గోవిందయ్య హాజరై వనపర్తి , గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలకు సీనియర్ చేనేత వీవర్స్‌కు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయంలో మూడేండ్ల డిప్లొమా హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సులకు 60సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు రూ.2,500 ఉపకార వేతనం, కళాశాల ఫీజు ఏడాదికి రూ.4,050, వసతి సదుపాయం కల్పించబడుతుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### 23 నుంచి ఎస్‌జీఎఫ్ పోటీలు

మల్దకల్, ఆగస్టు 17 : అండర్-14, 17 బాలబాలికలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సురేశ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 23వ తేదీ నుంచి పోటీలు ఉంటాయని, ఆసక్తి గల క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డుతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జితేందర్, పీడీ సుహాసిని వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు.

### సమస్యలు పరిష్కరించాలి



ఇరిగేషన్ రాష్ట్ర సలహాదారు ఆదిత్యనాథ్‌కు వినతిపత్రం అందచేస్తున్న విజయ్‌కుమార్

గట్టు, ఆగస్టు 17 : చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇరిగేషన్ ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్‌ను మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ కోరారు. గట్టు మండల పర్యటనకు వారు శనివారం వచ్చిన సందర్భంగా మంత్రి, ఇరిగేషన్ ప్రభుత్వ సలహాదారుకు ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. అంసంపూర్తిగా ఉన్న పాఠశాల, అంగన్‌వాడీ, రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఖిల్లాఘణపురం, ఆగస్టు 17 : మండలంలోని ఉప్పరిపల్లికి చెందిన వాకిటి చిన్నయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మాజీ మంత్రి ఆదేశాల మేరకు మాజీ సర్పంచు రాంరెడ్డి, ఉపసర్పంచ్ బాలరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం నిరంజన్‌రెడ్డి అందించిన రూ.5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

ఉండవెల్లి, ఆగస్టు 17 : కూలీలలో వెళ్తున్న ఆటోను గురువారం లారీ ఢీకొన్న ఘటనలో గాయపడిన అనిత(33)అనే మహిళ కర్నూల్ ప్రభుత్వ దవఖానలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలికి భర్త సాయిబాబ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరిది కర్నూల్ జిల్లా ఈ తాండ్రపాడు గ్రామమని ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఇప్పటికే ఈ ప్రమాదంలో నలుగురు చనిపోయినట్లు వెల్లడించారు.

### అలంపూర్ ఏవోగా నాగార్జున్‌రెడ్డి

అలంపూర్, ఆగస్టు 17 : అలంపూర్ మండలం వ్యవసాయాధికారిగా నాగార్జున్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏవోగా విధులు నిర్వహించిన అనిత ఉండవల్లి మండలానికి బదిలీ కాగా, ఆమె స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలో ఏవోగా పనిచేసిన నాగార్జున్‌రెడ్డి ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఏవోకు ఏడీఏ సక్రియానాయక్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

### సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూరు, ఆగస్టు 17 : పట్టణానికి చెందిన చిన్న మధు మార్చి 18న తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఫోన్‌ను ట్రాక్ చేసి గుర్తించి దొరకబట్టారు. శనివారం బాధితుడు చిన్న మధుకు ఎస్సై నరేందర్ సెల్‌ఫోన్‌ను అందించారు.